తీసుకుంది.

* * *

"ఏమిటి నువ్వు చేసింది? అల్లుడితో తెగతెంపులు చేసుకునే వచ్చేశావా?" ఆందోళనగా అడిగింది తల్లి లలితమ్మ సహజని.

"అంతా విని కూడా అలా మాట్లాడతావేంటమ్మా? అతని మనసులో నాకు స్థానం లేనప్పుడు అక్కడ ఎలా ఉండగలను?" బాధగా అంది సహజ.

"అది కాదమ్మా! అల్లుడుగారితో మేము మాట్లాడతాం" అంది లలితమ్మ.

"అమ్మా! ఆయన ఇప్పుడు ఎవరు చెప్పినా వినే స్థితిలో లేరు. భవిష్యత్‌లో ఎప్పుడైనా నేను లేకండా ఉండలేనని ఆయన భావించి నా దగ్గరకు వస్తే అప్పుడు వెళ్తాను" తల్లితో అంది సహజ.

తల్లి ఇంకా ఏదో అనబోయేంతలో తండ్రి రాజారావు అడ్డు వచ్చారు.ఆయనకి కూతురి మనస్తత్వం బాగా తెలుసు. తను ఏ నిర్ణయం తీసుకున్నా బాగా ఆలోచించే తీసుకుంటుంది. తనేం చిన్నపిల్ల కాదుకదా తన జీవితం మీద అవగాహన లేకపోవడానికి- ఆమె నచ్చిన విధంగా జీవించగలదు.

"నీ ఇష్టం తల్లీ. నీకు నచ్చిన విధంగా చెయ్" అని ఆయన వెళ్లిపోయారు.

తండ్రి తనకు సపోర్ట్ చేయడంతో చాలా సంతృప్తిగా ఫీలయింది సహజ. అందరి తండ్రుల్లా ఏదో విధంగా భర్తతో సర్దుకుపో అని అనకుండా తన మనసుని అర్థం చేసుకున్నారు. ఈమాత్రం తల్లిదండ్రుల సపోర్ట్ ఉంటే చాలు ఎవరి మీద ఆధారపడకుండా, ఆత్మాభిమానం చంపుకోకుండా బ్రతకగలదు. తను చదివిన చదువుకి ఏ చిన్న ఉద్యోగమైనా చేసుకుని ఎవరికీ భారం కాకుండా తను జీవించగలదు.

ఆ రాత్రి తన భవిష్యత్ గురించి ఆలోచిస్తూ ఎప్పుడో నిద్రలోకి జారుకుంది సహజ.

**-రాఘవి (ఏలేశ్వరం)**

## నిజాయితీ



**"ఏవండీ! డాక్టర్ చెప్పిన డ్యూ డేట్‌కి ఇంకా వారం రోజులున్నా ఇవాళో రేపో డెలివరీ అయ్యేట్టుంది నా పరిస్థితి. డాక్టర్ ఆపరేషన్ చెయ్యాల్సొస్తుందని చెప్పింది. ఆఫీసుకెళ్లి ఓ వారం రోజులు లీవు పెట్టి, జీతం అడ్వాన్సు తీసుకు రండి. డెలివరీ టైములో మీరు నాతో ఉంటే ధైర్యంగా ఉంటుంది" అని ఉదయం డ్యూటీకొచ్చేటప్పుడు భార్య చెప్పిన మాటలు గుర్తొచ్చి మేనేజర్ గదికెళ్లి, పరిస్థితి చెప్పాడు శంకర్.**

"రేపు మన కంపెనీకి ఆస్ట్రేలియా ఎన్నారై వస్తున్నారు. ఆయన్ని కార్లో తీసుకురావాలి. నీకు లీవిచ్చి, ఇంపోర్టెడ్ కారుకి వేరే వాళ్లని డ్రైవర్‌గా నియమించడం కుదరదు. వచ్చేవారం లీవు తీసుకో" అనేసరికి జీతం అడ్వాన్సు సంగతి పెదవి దాటలేదు.

ఆరోజు రాత్రి భార్యకి పరిస్థితి చెప్పి, తోడుగా తల్లిని తీసుకొచ్చి డబ్బు ఏర్పాటు చేసి, మర్నాడుదయం డ్యూటీకి వచ్చాడు శంకర్.

* * *

ఆరోజొచ్చిన ఆస్ట్రేలియా ఎన్నారైతో మధ్యాహ్నం వరకూ డిస్కషన్స్ జరిపిన ఎం.డి., లంచ్ తర్వాత గేటు వరకూ వచ్చి ఆయన్ని కారెక్కించాడు. కారులో కూర్చున్న ఆ ప్రవాసాంధ్రుడు ఆస్ట్రేలియాలో సెటిలై మంచి పొజిషన్‌లో ఉన్న విజయవాడ వాసి. ఆరో జంతా సిటీలో ఆయన చూడాలనుకున్న ప్రదేశాలన్నిటికీ తీసుకెళ్లిన శంకర్, మర్నాడు కారులో ఆయన్ని విజయవాడ దగ్గరున్న ఆయన స్వస్థలానికి, బంధువుల ఇళ్లకి తీసుకెళ్లాడు. మొత్తానికి రెండ్రోజుల్లో వీలైన ప్రదేశాలన్నిటినీ తిప్పి చూపడమే కాక ఆయా ప్రదేశ ప్రాముఖ్యతనూ వివరించి చెప్పి, అతని అభిమానానికి పాత్రుడయ్యాడు.

* * *

మూడోరోజు ఉదయం కంపెనీ మేనేజర్, పి.ఎ. చక్రపాణిని కలిసి కార్లో ఆస్ట్రేలియా ఆంధ్రుడు బస చేసిన స్టార్ హోటల్కొచ్చి, ఆయన్ని పికప్ చేసుకుని, ఎయిర్‌పోర్టుకి తీసుకెళ్లాడు శంకర్. ఎం.డి. తన కారులో ఎయిర్‌పోర్టుకి చేరుకున్నాడు. ఫ్లయిట్ బయలుదేరడానికి ఇంకా సమయముంది. మాటల మధ్యలో-ఇరవై ఏళ్ల తర్వాత ఆంధ్రా వచ్చిన తనని ఈ రెండ్రోజుల్లో ఎన్నో ప్రదేశాలు ఓపిగ్గా తిప్పి చూపడమే కాక, ఓ గైడ్‌లా అన్నీ వివరించి చెప్పాడని ఎం.డి.కి చెబుతూ, వాళ్లకి కొద్ది దూరంలో చేతులు కట్టుకుని నిలబడిన శంకర్‌ని పిలిచి, ఐదువేల రూపాయలు తీసిస్తూ "ఇవి తీసుకో శంకర్! నాకున్న వసతికి ఇదేమంత ఎక్కువ కాదు. నా గుర్తుగా దేనికైనా ఉపయోగించుకో" అని ఇవ్వబోతుంటే శంకర్ నిరాకరించాడు. అతడెంత బలవంతపెట్టినా శంకర్ తీసుకోకపోవటం అతడిని ఆశ్చర్యపరిచింది.

ఫ్లయిట్ టేకాఫ్ అయ్యాక కారులో వెనక సీట్లో మేనేజర్, ముందు సీట్లో పి.ఎ.చక్రపాణి కూర్చున్నారు. కారు వేగంగా పోతోంది. మేనేజర్ పేపరులో నిమగ్నమయ్యాడు.

పి.ఎ.చక్రపాణి మంద్రస్వరంతో "ఆ పెద్దమనిషి డబ్బిస్తే, పిచ్చివాడిలా వద్దన్నావేమిటయ్యా! మొన్నొచ్చి భార్యకి డెలివరీ టైము లీవు కావాలి, జీతం అడ్వాన్సు కావాలి అనడిగావా? ఇప్పుడా డబ్బు తీసుకుంటే ఉపయోగపడేదా?" అన్నాడు.

"పాణీ సార్! ఇంత పెద్ద కంపెనీలో పని చేస్తున్న నేను చేసిన డ్యూటీకి, ఎవరో తెలియని వ్యక్తి తన ఔదార్యాన్ని డబ్బు రూపంలో మన ఎం.డి. ముందు ఇవ్వజూపడం, అతనిది పెద్ద మనసు కావచ్చు కానీ దాన్ని తీసుకుంటే మన కంపెనీ పేరు, ఎం.డి.గారి పరువు తీసినట్టవుతుంది. అది నా మనస్తత్వానికి విరుద్ధం. అవకాశం దొరికిందని విచక్షణ కోల్పోకూడదు సార్" అన్నాడు.

కారు మరో పది నిమిషాల్లో కంపెనీ ఆవరణలోకి ప్రవేశించింది. కారు గారేజీలో పెట్టి వెళుతున్న శంకర్‌ని, తన ఛాంబర్‌కి రమ్మన్నాడు మేనేజర్.

శంకర్ అడిగిన లీవు, జీతం అడ్వాన్సులతోపాటు అతని నిజాయితీకి గుర్తింపుగా ఓ గిఫ్ట్‌చెక్ ఇచ్చాడు మేనేజర్.

**-ఎం.వెంకటేశ్వరరావు (సికిందరాబాద్)**